# ✻ సంఘం ✻

✻

శ్రీ పి. కృష్ణమూర్తి

ఆమె యవ్వనవతి, రూపసి. ఆమె ముఖంలో విశాలత్వం గోచరిస్తుంది. నడకలో నవ్యత్వంవుంది. కన్నులలో కరుణ చిందులాడ్తుంది. హృదయం కరుణాపూరితం. పెదవులు చిరునవ్వుల ప్రొద్దు పుచ్చుతూంటాయి. వీటన్నిటికీ మించిన విద్య వుంది.

కాని సంఘం ఆమెను కరుణతో చూడదు. ఆమెయెడ కఠినంగా ప్రవర్తిస్తుంది. ప్రపంచంలో "స్వేచ్ఛ" అను పదానికి నిర్వచన మిచ్చేందుకు హక్కు లేకుండా నిషేధించింది. ఆమె ఆనందాన్ని వాంఛించరాదు సంఘంలో తలెత్తుకొని తిరుగరాదు. సంఘం ఆమెను బానిసకంటే హీనంగా చూస్తుంది. వీటన్నిటికి కారణం ఆమె బాల్యంలోనే భర్తఅంటే ఏమిటోకూడా తెలియని పసితనంలోనే "భర్త"అని సంఘంచేత నియమింపబడ్డ వ్యక్తిని కోలుపోవడం ఇది ఆమెచేసిన మహాపచారం.

ఇక నామెకు జీవితమాధుర్యాన్ని చవిచూచేందుకు హక్కు లేదు. పరపురుషుని కన్నెత్తిచూస్తే "సంఘం"గ్రుడ్డి సంఘంలో పదవిగల పెద్దలంతా ఆమెపై అంతు వేస్తారు. ఆస్త్రీ యిక వివాహమాడరాదు. కాని పురుషుడు ఒక భార్యను కలిగియుండికూడా వివాహం చేసుకోవచ్చు. నలుబదియవ యేట నాలుగవ వివాహాని కంగీకరిస్తుంది. నాలుగోరోజే భర్త చనిపోతే ఆస్త్రీని "వైధవ" అంటూ వేధించుతుంది. అబ్బబ్బ యెంతఘనమైన సంఘం. స్త్రీలంటే తమ ఐహిక వాంఛలను తీర్చుకొనుట కుపయోగపడే మట్టిబొమ్మలని నిరూపిస్తుంది గ్రుడ్డిసంఘం. ఈ ద్వేషంతోనే మొదటినుండి కూడా "స్త్రీవిద్య"ను ద్వేషిస్తూవచ్చింది. స్త్రీ చదువుకొంటే తమ బండాలం బయటపడుతుందని భయం.

"సంఘం" యీపేరుతో యెందరు స్త్రీపురుషుల జీవితాలు నాశనమయ్యాయో! ఈ సంఘపు దౌర్జన్య ఫలితంగా యెందరి కుటుంబాలీ అనంతవాయువుల్లో లీనమయ్యాయో! మరెందరినీ సంఘం గన యినుపకాళ్ళతో నుసిచేస్తుందో. ఒక్కసారి ఆలోచించుకుంటే హృదయం బ్రద్దలవుతుంది.

తమ ప్రాబల్యాన్ని పెంపొందించుకొనేందుకు అభివృద్ధి నిరోధకులు, స్వార్థపరులు ఈ "సంఘం" అనే ఒక పిశాచాన్ని అడ్డుగా పెట్టుకొని యెన్నో ఘోరాలు చేసారు, చేస్తున్నారు. వీటి కంతంలేదా?

ప్రతి విద్యావంతుడైన యువతీ యువకులు నడుంకట్టి ముందంజవేయాలి. సంఘంలోని క్రుళ్ళును బ్రద్ధలు చేయాలి. ఈ సంఘ పిశాచాన్ని నాశనంచేసి మానవసమాజాన్ని సుఖమయం చేయాలి. నాడే దేశంబాగుపడుతుంది. మానవ సమాజాభివృద్ధి కలుగుతుంది.

ఆమెపేరు సరస్వతి'. వయసు 18సం. చిన్నతనంలోనే భర్తయనబడే యువకుడు గతించాడు. తండ్రి లేడు, తల్లిమాత్రంవుంది. కొద్దో గొప్పో ఆస్తి వుంది. ఆమెకుమార్ అనే యువకుణ్ణి ప్రేమించింది. తల్లికి వీరిప్రేమ సంఘంమూలాన సంకటమైపోయింది. అందుచేత సరూ చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. కుమార్‌ను కలుసుకునేందుకు వీలు చిక్కడంలేదు.

ఒకదినం—

సందెవెన్నెట్లో—

నదీతీరాన—

ప్రేయసీ ప్రియులు-కుమార్ సరూలు కలుసుకోవటం తటస్థించింది.

"ఏం అలాగయి పోతున్నావు సరూ"

"ఏముంది కుమార్, ఏలాగయి పోతున్నాను. మామూలుగానే వున్నానే అంది మనసులోని భావాల్ని మాయం చేసుకుంటూ!

సరూ! అన్నీ తెలుసు కాని ఏం చెయ్యను. సంఘం నిన్నూ నన్నూ వేరు చేసింది. కనీసం కలిసి

ఆనందంగా మాట్లాడుకునేందుకైనా అంగీకరించటం లేదు.

కుమార్! యీదినం ఒక విషయం నిన్నడిగి తేల్చుకునేందుకు వచ్చాను. సరియైన సమాధాన మిస్తావా?

అతప్పక అడుగు సరూ! నీకెన్నడైనా ఎదురు చెప్పానా!

ఇంతవరకూ లేదు కాని యికముందేమైనా చెపుతారని...

పిచ్చిదానా అల్లైన్నటికీ జరుగదు. సంఘం మన శరీరాల్ని బాహ్యంగా వేరుపరచగలిగిందే కాని ఆత్మలు వేరుపరచగలిగిందా? అంటూంటే ఆతనిలోని వుద్రేకం సరస్వతికి ధైర్యం చేకూరుస్తుంది.

ఏంలేదు. మన ప్రేమ తుదకు నాతల్లికి కూడా కష్టంగావుంది. నీతల్లిదండ్రులకు అసలే యిష్టం లేదు కదా! అటువంటప్పుడు మన ప్రేమ ఫలోన్ముఖానికి వచ్చేదలా?

సరూ! యింకా నీవు చాల వెనుకబడేవున్నావు. తల్లిదండ్రు లంగీకరిస్తారని మనం ప్రేమించుకున్నామా! వారంగీకరించుటలేదని మానుకుంటామా? మన నిష్కల్మష ప్రేమ యీసంఘానికి బలిఅవుతుంటే చూస్తూ వూరుకోవలసిందేనా! మనపవిత్ర ప్రేమకోసం సరూ! నాతల్లిదండ్రులనేకాదు, సంఘంతోటి సంబంధాన్నే వదలుకుంటాం- లోకంతో పనిలేని ఈ గ్రుడ్డి సంఘదౌర్జన్యానికి లోనుగాని, సౌఖ్యజీవయాత్ర గడుపుదాం అంటూంటే అతనిలోని వేడిరక్తం పొంగింది.

కుమార్! అంది ఎంతో ఆప్యాయంగా సరూ!

సరూ! అంటూ కుమార్ సరూ తలనిమురుతూ ఎంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

ఇప్పుడు వారిద్దరిని సంఘం వెలివేసింది. తల్లిదండ్రులు దూరమయ్యారు కాని సంఘం పెట్టేబాధల నుండి భయపడ్డారు. నరకకూపంలో నుంచి నిర్బంధ విధానం అమలులోలేని సౌఖ్య జీవితాన్ని గడపుతున్నారా ప్రేమీ ప్రేమికులు. విద్యావంతులు కుమార్ త్యాగాన్ని పొగిడారు. కుటిలులు కుమార్‌ని ద్వేషించారు. సరూ ఎన్నడూ ఎరుగని తన జీవిత మాధుర్యాన్ని కుమార్ సన్నిధిని పొందుతూంది. ఇప్పుడు వారిది ఆదర్శమయ ఆనంద జీవితం.

వారి ప్రేమకు ప్రతిగా "ప్రమోద్" జనించాడు. వారికపురి ఆనందాని కంతులేదు. ప్రమోద్‌నుగూడా సంఘసంస్కర్తగానే పెంచాలని తల్లి చిన్నతనంనుండి శ్రద్ధదీసుకుటుంది. ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నారా అధునాతన సంఘ సంస్కర్తలు కుమార్ సరూలు.

## స్వీకారం

### ఆంధ్రజ్యోతి ఉగాది సంచిక

ఆంధ్రజ్యోతి ఉగాది సంచిక మా కార్యాలయం చేరింది. స్త్రీల సమస్యలకు సంబంధించిన అనేక వ్యాసాలు, కథలు వున్నవి. సంచిక వెల 1-0-0 వలయువారు: ఆంధ్రజ్యోతి. 37, ఆచారప్పన్ వీధి. మదరాసు. అని వ్రాయాలి.

* * *

### నటన

ప్రపంచమనే రంగస్థలాన పరమాత్ముని అనంత సౌందర్య రేఖల విభిన్న స్వరూపాల యదార్థ్యాన్ని. నటనా విశేష ప్రబోధములకు ప్రకటించడమే లక్ష్యంగాగల "నటన" కొత్త పత్రికలో కళలకు అధికంగా ప్రాముఖ్యమివ్వబడింది. తొలిసంచిక ముద్దులు మూటకట్టుచూ ఆశాభావాన్ని కలిగిస్తున్నది. వెల అరణాలు. సాలుచందా అయిదు రూపాయలు. సంపాదకులు: శ్రీ ఎం. ఎస్. రామాచారి గారు. వలయువారు: 'నటన' 42. ఏ. బజారురోడ్డు, రాయపేట. మదరాసు అని వ్రాయాలి.